ఎల్‌బీనగర్ ప్రజలే నా బలం.. బలగం


కొత్తపేటలో సుధీర్‌రెడ్డికి గుమ్మడి కాయతో దిష్టి తీస్తున్న కాలనీవాసులు


స్నేహపురి కాలనీలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న సుధీర్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ ప్రజలే తన బలం, బలగం అని, కేసీఆర్ ఆశీస్సులు, ఎల్‌బీనగర్ వాసుల ఆశీర్వాద బలంతో మరోమారు ఎల్‌బీ నగర్‌లో ఘన విజయం సాధించి తీరుతానని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కొత్తపేట డివిజన్‌లోని జైన్ మందిర్ నుంచి స్నేహపురి కాలనీ వరకు ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి తనను మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు ఆయనకు నీరాజనాలు పలికారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై మంగళహారతులు ఇచ్చారు. గుమ్మడి కాయతో దిష్టి తీసి నుదుటున తిలకం దిద్ది ఘనంగా స్వాగతం పలికారు. కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీ నగర్‌లో దశాబ్దాలుగా తిష్ట వేసి ఉన్న సమస్యలను తాను గత ఐదేళ్లుగా భారీ నిధులు మంజూరు చేయించి శాశ్వత పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఎల్‌బీనగర్ వాసులతో కుటుంబ సభ్యుడిగా నిత్యం కలిసి ఉంటూ వారి కష్ట, సుఖాలలో పాలుపంచుకుంటున్నానని మరోమారు తనను ఆశీర్వదించాలని కోరారు. వరదలు, కరోనా కష్ట కాలంలో ముఖం చాటేసిన నాయకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఆత్మీయత, బంధుత్వాలను గుర్తు చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారని, వారి ఎత్తులను చిత్తు చేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కొన్ని పార్టీల అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుందని, అందువల్లే తన పేరుతో ఉన్న ఓ వ్యక్తిచే ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ వేయించారని ఆరోపించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా ఎల్‌బీనగర్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగుర వేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ కార్పొరేటర్ సాగర్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, చైతన్యపురి పార్టీ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు లింగాల నాగేశ్వరరావు, శ్వేతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని హైకోర్ట్ కాలనీలో స్థానిక నివాసి నరహరిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీమాంధ్రులు సుధీర్‌రెడ్డిని ఘనంగా సన్మానించి తామంతా కారు గుర్తుపై ఓటు వేసి సుధీర్‌రెడ్డి ఘన విజయంలో భాగస్వాములమవుతామని హామీ ఇచ్చారు. ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, కుర్మారావు, నరసింహారావు, భాస్కర్, సుమంత్, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

మందకొడిగా ఓటరు స్లిప్పుల పంపిణీ

- ఈనెల 22 లోగా పంచేందుకు ఎన్నికల అధికారుల యత్నం
- పూర్తి స్థాయిలో పంపిణీ జరిగేనా..?

చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటరు స్లిప్పులు పంచడంలో ఎన్నికల అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈనెల 14న ప్రారంభమైన స్లిప్పుల పంపిణీ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మందకొడిగా సాగుతోంది. నియోజకవర్గంలో మొత్తం 5,93,714 ఓట్లు ఉండగా, నాలుగు రోజుల్లో కేవలం 85 వేలు స్లిప్పులు మాత్రమే ఓటర్లకు పంపిణీ చేశారు. 570 పోలింగ్ స్టేషన్ల పరిధిలో డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్ విజయలక్ష్మి, సెక్టోరల్ అధికారుల పర్యవేక్షణలో 570 మంది బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లు ఓటర్ స్లిప్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

మరో ఐదు రోజుల్లో పూర్తి స్థాయిలో ఓటరు స్లిప్పులు ఓటర్లందరికీ అందుతాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసి పంచితే పూర్తి స్థాయిలో పంపిణీ చేసే అవకాశం ఉంది.

అందకుంటే ఫిర్యాదు చేయండి: ఆర్‌ఓ పంకజ

ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన ఓటరు సమాచారం స్లిప్పులు ఈనెల 22 లోగా బూత్ లెవెల్‌లో పంపిణీ చేస్తారని ఆర్‌ఓ ఎస్.పంకజ తెలిపారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా సెక్టోరల్ అధికారులు, పర్యవేక్షక అధికారుల పర్యవేక్షణలో ఓటరు స్లిప్పులు పంచడం జరుగుతుందన్నారు. ఓటరు స్లిప్పులు అందని ఓటర్లు కొత్తపేటలోని ఈస్ట్ జోనల్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 040-24140937 కు ఫిర్యాదు నమోదు చేయవచ్చని, లేదా.. డిప్యూటీ ఎస్టేట్ అధికారి విజయలక్ష్మి సెల్ నంబర్ 7702104249లో సంప్రదించాలని అన్నారు.

జంగ్ తెలంగాణ 2023

ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ

మలక్‌పేట: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మూసారంబాగ్ ఆరోరా కాలేజీలో శిక్షణ ఇచ్చారు. మలక్‌పేట ఆర్‌ఓ ఉపేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఓటరు కార్డును, తీసుకొచ్చిన వివరాలను పరిశీలించి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల సంఘం గతం నుంచీ ఆమోదిస్తున్న 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించినా సరిపోతుందన్నారు. ఈవీఎం మొరాయిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలకు సీల్ వేసి అనంతరం వాటిని భద్రత పరచాల్సిన ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా కొనసాగడానికి పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. 360 మంది అధికారులకు గాను 335 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓలు, అధికారులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకొనేందుకు డబ్బుల డిమాండ్ : కేసు నమోదు

చంచల్‌గూడ: ఇల్లు నిర్మించేందుకు వృద్ధురాలి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఎంఐఎం పార్టీ సభ్యుడిపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మాదన్నపేటకు చెందిన బాస వరలక్ష్మి (68) తన ఇంటి నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి ఇంటికి పక్కన ఉండే మన్సూర్ అహ్మద్ అనే వ్యక్తి తాను ఎంఐఎం పార్టీ సభ్యుడినని, నిర్మాణం కొనసాగలంటే తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇదే క్రమంలో గత బుధవారం మన్సూర్ నిర్మాణం పనులను అడ్డుకుని వరలక్ష్మిని అసభ్య పదజాలంతో దూషిస్తూ నిర్మాణ సామగ్రిని ధ్వంసం చేశాడు. ఈ మేరకు బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

హిందూ ధర్మం అతి పురాతన సంస్కృతి

దిల్‌సుఖ్‌నగర్: హిందూ ధర్మం అతి పురాతన సంస్కృతి అని కుర్తాళం పీఠం పీఠాధిపతులు జగద్గురువు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో స్వామీజీ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన అన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ, విట్టల్ శర్ ,హేమంత్ శర్మ పాల్గొన్నారు..

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బాలాజీనగర్‌లోని సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎల్‌బీనగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీ ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, భిక్షపతి, కృష్ణాగౌడ్, రాజేశ్, అమర్వాది ప్రసాద్, బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి, సంతోష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ది సంక్షేమం.. విపక్షాలది సంక్షోభం

- బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

కందుకూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి అభ్యర్థించారు. కేసీఆర్‌ది సంక్షేమ పాలన.. ప్రతిపక్షాలది సంక్షోభమని విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని 9 గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని మండిపడ్డారు. సాగుకు మూడు గంటలు విద్యుత్ ఇచ్చే కర్ణాటకను, మోడల్‌గా తెస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రానికి నిధులివ్వని ప్రధాని మోదీ.. సందర్భం దొరికినప్పుడల్లా తెలంగాణపై విషం చిమ్ముతుంటే, బీజేపీ నాయకులు మాత్రం ఆయనను దేవుడిలా కొలుస్తున్నారని మండిపడ్డారు. కారు గుర్తుకే ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. మహేశ్వరంలో సబితారెడ్డిని అత్యధిక మెజారీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అధిక నిధులతో అభివృద్ధి చేస్తా


సాయినగర్ సీనియర్ సిటిజెన్స్ ఫోరంలో వయోవృద్ధులతో మధుయాష్కీ గౌడ్

- కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

ఎల్‌బీనగర్/వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కాలనీల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తనను గెలిపిస్తే అధిక నిధులు తీసుకొచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. గురువారం రాత్రి లింగోజిగూడ డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ×మార్పు కోసం మధుయాష్కీ గౌడ్‌ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగిన తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి ఇక్కడ పోటీ చేస్తున్నానని, అవినీతి రహిత ఎల్‌బీనగర్ తన లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవస్థానం డైరెక్టర్ జూపల్లి ప్రవీణ్, టీజేఎస్ నాయకుడు పల్లె వినయ్ ఆధ్వర్యంలో రిటైర్డు ఉద్యోగులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు యశ్వంత్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, రాజేశ్వరి, వాసు, రమేష్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల కేంద్రంలో...

శ్రీ సాయినగర్ సీనియర్ సిటిజెన్ ఫోరం వయోవృద్ధుల సేవా కేంద్రంలో ఫోరం అధ్యక్షుడు పి.దయానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందు పాల్గొన్న మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ... సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజల సమస్యలే తన మేనిఫెస్టో అని అన్నారు. నాయకులు రామచంద్రారెడ్డి, మంజులా రెడ్డి, శైలజా రెడ్డి, శ్రీనివాసచారి, ప్రసాద్ పాల్గొన్నారు.

చంపాపేట డివిజన్‌లో చేరికలు...

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ భిక్షపతిగౌడ్, లక్ష్మణ్, పెంటయ్య, విఠల్, ప్రభాకర్, సత్యనారాయణ గౌడ్, జైచంద్రగౌడ్, అంజయ్య, దశరథ ముదిరాజ్, కారంపూడి పద్మనాభం, వీరేష్‌గౌడ్ తదితరులు మధుయాష్కీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మన్సూరాబాద్ డివిజన్‌లో...

మన్సూరాబాద్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రపురి కాలనీ, సహారా ఎస్టేట్ కాలనీలలో మధుయాష్కీ గౌడ్ ప్రచారం నిర్వహించారు. నాయకులు స్వర్ణమాధవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఫ్రెండ్లీ మీట్‌లో...

వనస్థలిపురం పనామా చౌరస్తాలోని ఎస్‌వైఎస్ గ్రాండ్‌లో రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు నిర్వహించిన ఫ్రెండ్లీ మీట్ కార్యక్రమానికి మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు లేక పేదల పరేషాన్

- బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి


చంపాపేటలో సామ రంగారెడ్డికి మంగళహారతి పడుతున్న మహిళ

మన్సూరాబాద్/చంపాపేట్/నాగోలు: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు నూతనంగా ఒక్క రేషన్‌కార్డు కూడా సీఎం కేసీఆర్ ఇవ్వలేకపోయాడని, రేషన్‌కార్డులు లేక నిరుపేదలు పరేషాన్ అవుతున్నారని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంపాపేట, గడ్డిఅన్నారం, చైతన్యపురి, నాగోలు డివిజన్లలో ఆయా కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహగుప్తా, చింతల అరుణసురేందర్‌యాదవ్‌లతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కేవలం కొద్ది మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలకే లభించాయని, సీఎం కేసీఆర్ ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేది మరొకటని మండిపడ్డారు. ప్రభుత్వ పథకాలు మొదటగా తనబంధువులకు, అనుచరులకు మాత్రమే దక్కేలా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. ఎల్‌బీనగర్ అభివృద్ధి కోసం ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

మహిళల సంరక్షణే ధ్యేయం

- ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్

నాగోలు: మహిళల సంరక్షణే ధ్యేయంగా రాచకొండ షీ టీమ్స్ పనిచేస్తున్నాయని రాచకొండ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషా విశ్వనాథ్ అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత 15 రోజుల్లో 126 మంది ఆకతాయిలను రాచకొండ షీ టీమ్స్ పట్టుకున్నాయి. వీరిలో 58 మంది మేజర్స్, 68 మంది మైనర్లు ఉన్నారు. వీరిని షీ టీమ్స్ అరెస్టు చేశారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఉషా విశ్వనాథ్ మాట్లాడుతూ, మహిళలను వేధించే వారికి 'ఎల్లప్పుడూ మీ కోసం.. మీతో' అనే నినాదంతో రాచకొండ షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, బాధితులు నిర్భయంగా, నిశ్చింతగా షీటీమ్స్‌ను సంప్రదించవచ్చు అని తెలిపారు. నిత్యం షీ టీమ్స్ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, మహిళలను వెంబడిస్తూ వేధించే పోకిరీలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తూ.. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. గత నెల అక్టోబర్ 16 నుంచి 31 వరకు 148 ఫిర్యాదులు అందాయని, వీటిపై విచారణ చేసి దర్యాప్తు పూర్తి చేశామన్నారు. ఈ ఫిర్యాదుల్లో ఫోన్ల ద్వారా వేధించిన ఘటనలు 8 , వాట్సాప్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వేధించినవి16, సోషల్ మీడియా ద్వారా వేధించినవి 8, నేరుగా వేధించినవి 116 ఉన్నాయన్నారు. ఇందులో క్రిమినల్ కేసులు 7, పెట్టి కేసులు 55 కాగా, మొత్తం 86 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపారు. మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించి మహిళా కంపార్ట్మెంట్‌లో ప్రయాణిస్తున్న ఆరుగురిని పట్టుకుని మెట్రో స్టేషన్ అధికారుల ద్వారా జరిమానా వేయించామన్నారు. రాచకొండ పరిధి లోని మహిళలు వేధింపులకు గురైతే షీటీమ్స్ రాచకొండ వాటాప్స్ 87126 62111కు ఫిర్యాదు చేయాలన్నారు. ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పరశురాం పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడింది

- బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్


ప్రచారం చేస్తున్న అందెల శ్రీరాములు

హుడాకాంప్లెక్స్: రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్‌లతో కలిసి గడప గడపకూ తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, ఇంద్రసేనారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వేసిన రోడ్లు, డ్రైనేజీ తప్పా.. కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. పేదలకు అందాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్లు, రేషన్‌కార్డులు 9 ఏళ్లుగా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆరుట్ల సురేశ్, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, జైన్‌బాబు, శివ, కార్తీక్, జంగయ్య, సురేశ్ ముదిరాజ్, త్రివేణి పాల్గొన్నారు. అలాగే సరూర్ నగర్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో బీజేపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఆర్‌కేపురం డివిజన్‌లో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో బీజేపీ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా శుక్రవారం స్థానిక కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి శ్రీరాములును గెలిపించాలని కోరారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌వన్నీ అబద్ధాలే

- కాంగ్రెస్ మహేశ్వరం అభ్యర్థి కేఎల్లార్


ప్రచారంలో అభివాదం చేస్తున్న కేఎల్లార్

కందుకూరు: పేదలకు కాంగ్రెస్ హయాంలో భూములిస్తే, ఇప్పుడు ఆ భూములను సీఎం కేసీఆర్ గుంజుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని 13 గ్రామాల్లో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పడుకుని ప్రజలకు అన్ని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి కాంగ్రెస్ తరఫున గెలిచి.. బీఆర్‌ఎస్‌లో చేరి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అసైన్డ్, లావణ్య, భూదాన్ భూములకు పట్టాలిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, వైస్ ఎంపీపీ శమంత, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో ఇంటింటికీ చేరాలి

- మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్


కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న షేక్ అక్బర్

మలక్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఇంటింటికీ చేరాలని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి షేక్ అక్బర్ కార్యకర్తలకు సూచించారు. మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా శుక్రవారం ఆయన నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అక్బర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేరువైందని, 36 హామీలతో కొత్తగా విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాయకులు విజయసింహారెడ్డి, సంఘిరెడ్డి, బోనగిరి చంద్రశేఖర్, జాఫర్, చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

సైదాబాద్: నియోజకవర్గంలో అభివృద్ధి అగమ్య గోచరంగా మారటంతో మలక్‌పేటవాసులు ఈసారి మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. శుక్రవారం ఆయన సైదాబాద్ డివిజన్ పరిధిలోని రెడ్డిబస్తీ, పూసలబస్తీలలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం షేక్ అక్బర్ మాట్లాడుతూ, మలక్‌పేటలో ఎక్కడికి వెళ్లినా తమ ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని అన్నారు. మలక్‌పేటలో కాంగ్రెస్ గెలుపుతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు మదన్‌బాబు, గంట్ల కృష్ణ పాల్గొన్నారు.

మలక్‌పేటలో బీజేపీకి పూర్వ వైభవం ఖాయం

- పార్టీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి


సైదాబాద్‌లో ఇస్త్రీ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలవడం ద్వారా మలక్‌పేటలో బీజేపీకి పూర్వ వైభవం తీసుకొస్తానని ఆ పార్టీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి సైదాబాద్ డివిజన్ హరిజన బస్తీ, రెడ్డిబస్తీ, సైదాబాద్ కాలనీల్లో పాయాత్ర ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, మజ్లిస్ ఆగడాలను అరికట్టేందుకు మలక్‌పేట ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. మలక్‌పేటలో మజ్లిస్ అవినీతి, అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకు ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. ఈసారి మలక్‌పేట ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తానన్నారు. ప్రచారంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వరిగంటి వినోద్ పాల్గొన్నారు.

మలక్‌పేటలో మళ్లీ ఎగిరేది గాలిపటమే..

- మజ్లిస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బలాల


ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అహ్మద్ బలాల

మలక్‌పేట: నాలుగోసారి మలక్‌పేటలో ఎగిరేది గాలిపటమేనని మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ నల్లగొండ క్రాస్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, నాయకులు షఫీయుద్దీన్, అబ్రార్, ఆలీమ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని ఆశించి బీజేపీని గెలిపించండి

- పార్టీ యాకుత్‌పురా అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్


ఐఎస్‌సదన్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: యాకుత్‌పురా నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిని ఆశించి ఈసారి బీజేపీని గెలిపించాలని పార్టీ అభ్యర్థి వీరేంద్రబాబు యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని విష్ణుపురి కాలనీ, పవన్‌పురి కాలనీ, బొంబాయి క్వార్టర్స్‌లో పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ కరపత్రాలు పంచుతూ ఓట్లు అభ్యర్థించారు. పాతబస్తీలో అభివృద్ధిని ఆమడ దూరంలో పెట్టిన ఎంఐఎం పార్టీకి ఈసారి పాతబస్తీవాసులు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్‌ను చేర్చడంపై హర్షం

చైతన్యపురి: కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై రెడ్డి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన రోజు నుంచి రెడ్డిలను ఓట్ల కోసమే వాడుకుంటూ రెడ్డి కార్పొరేషన్‌ను అందని ద్రాక్షలా చూపడెతున్నారని అన్నారు. రెడ్డి కులస్తుల ఆవేదనను అర్థం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రెడ్ల అభ్యున్నతికి కృషి చేసే పార్టీకే తమ మద్దతు ఉంటుందని వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో జరిగింది. వనస్థలిపురం పోలీసుల కథనం ప్రకారం... పాపిరెడ్డినగర్ కాలనీకి చెందిన కొర్ర ప్రకాశ్(21) తాను నివాసం ఉండే ఇంట్లో అక్రంగా మద్యాన్ని నిల్వ చేసి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ప్రకాశ్ ఇంటపై గురువారం రాత్రి దాడి చేశారు. ఆఫీసర్ ఛాయిస్ 90 ఎంఎల్ బాటిళ్లు 96, ఇంపీరియల్ బ్లూ 45 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ప్రకాశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.